క్లుప్తంగా

విశ్వనాథ ఆలయంలో ధనుర్మాస పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు, అర్చకులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 4నుంచి 13వరకు ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి మంజిలి ఉత్సవం, అభిషేకం జరిపారు. అర్చకుడు గోవర్ధన భట్టాచార్య మాట్లాడుతూ.. ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి వైకుంఠదర్శనం (ఉత్తర ద్వారం) ద్వారా వెంకటేశ్వరస్వామి దర్శనమిస్తారన్నారు. 13న గోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవం ఉంటుందని ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

తాండూర్: మండల విద్యా భారతి పాఠశాల విద్యార్థిని కె.శ్రీస్ఫూర్తి కారుణ్య జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. పోటీలు ఈ నెల 10నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ విద్యార్థినిని అభినందించి కరస్పాండెంట్ సురభి శరత్‌కుమార్ శాలువాతో సన్మానంచేశారు. రూ.5వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజిని, విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



సర్వాయిపేట నర్సరీ పరిశీలిస్తున్న డీఆర్డీవో

కోటపల్లి: గ్రామపంచాయతీల్లో చేపట్టే నర్సరీ పనుల్లో వేగం పెంచాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. సర్వాయిపేట, మల్లంపేట గ్రామాల్లోని నర్సరీలను, పశువుల పాక షెడ్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ త్వరగా పూర్తిచేసి మొక్కల పెంపకం వేగంగా జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో తడిపొడి చెత్త, అజోల్లా తయారీ పరిశీలించారు. విత్తనాలు మొలకెత్తడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఏపీవో వెంకటేశ్వర్, ఈసీ నాగేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్, డీసీపీలను కలిసిన జీఎం దేవేందర్



కలెక్టర్‌కు బొకే అందిస్తున్న జీఎం

బెల్లంపల్లి/మందమర్రిరూరల్: సింగరేణి కాలరీస్ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ శనివారం కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్ నాయక్, డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. పూల బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా స్థితిగతులను వారికి వివరించారు.

కలెక్టర్‌ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను సన్మానించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లిన ఆమె కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మర్యాద పూర్వకంగా కలెక్టర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆమె కోరారు.

నేడు బర్డ్‌వాక్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ రేంజ్ పరిధిలోని భీమారం గొల్లవాగు ప్రాజెక్టు నుంచి చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలోని అర్బన్ పార్కు వరకు ఆదివారం బర్డ్‌వాక్ నిర్వహించనున్నట్లు చెన్నూర్ ఫారెస్టు రేంజ్ అధికారి శివకుమార్ తెలిపారు. శనివారం పదిమంది సందర్శకులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

జైపూర్: గ్రామాల్లో అభివృద్ధి, పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. జైపూర్ మండలం ఇందారం, ముదిగుంట గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ.25లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిధులు మంజురు కావడంతో కొత్త భవనానికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ ఆయాంలో పల్లెలు అభివృద్ధికి నోచుకోలేదని, పంచాయతీలుగా ఏర్పడినప్పటికీ వాటికి భవనాలు, నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ మంజూరు చేయాలని వినతి

చెన్నూర్: చెన్నూర్ ఆశ్రమ పాఠశాలకు డైనింగ్ హాల్, డారమెంటరీ, లెట్రీన్ బ్లాక్‌లను మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆదివాసీ సంఘం నాయకులు జేక శేఖర్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతి



షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం ఇస్తున్న శరత్ బాబు

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణకు వివరణాత్మక అధ్యాయనం కోసం మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తర్‌తో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌కు డాక్టర్ జానపాటి శరత్ బాబు ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ ఆదిలాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు వర్గీకరణ జరగకపోవడంతో మాదిగలకు విద్య, ఉపాధి రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. మాదిగ సామాజికవర్గం నుంచి విద్యార్థులకు, ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు కూడా వర్గీకరణ ప్రకారం కేటాయించలేదని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీలను ఏ, బీ, సీ, డీ లుగా వర్గీకరించాలని ఆయన కోరారు.

వంటమనిషిపై చర్యలు తీసుకోవాలని వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక అండాళమ్మకాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సరైనా తిండి పెట్టకపోగా ఇదేమని అడిగిన వారిపై దురుసుగా వ్యవహరిస్తున్న మధ్యాహ్న భోజన వంటకారి కురాలిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు శనివారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల నుంచి తన సొంత అవసరాలకు కరెంట్ వినియోగించటం, ఇంటికి వెళ్లేందుకు దగ్గరి దారికోసం ప్రహరీ కూల్చివేసినట్లు తన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వంటమనిషిని విధుల నుంచి తొలగించి, కొత్త వారిని నియమించి మా పిల్లలకు సరైనా భోజనం అందేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానికులు బొలిశెట్టి కిషన్, సమ్మయ్య, సతీష్, శంకర్, తిరుపతి, వెంకటేశ్, మానస, లలిత తదితరులున్నారు.

మరమ్మతు పనుల పునరుద్ధరణకు శ్రీకారం

సాక్షి ఎఫెక్ట్..



ర్యాలీవాగు ఎడమ కాలువకు గండి

డిసెంబర్ 23న సాక్షిలో వచ్చిన కథనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామం పోచంపాడు శివారులోని ర్యాలీవాగు ప్రాజెక్ట్ ఎడమ కాలువకు గండి పడిన విషయంపై 'సాక్షి' దినపత్రిక గత నెల డిసెంబర్ 23వ తేదీన కథనం ప్రచురించింది. పోచంపాడు, వేంపల్లి, రంగపేటలకు చెందిన దాదాపు 50మంది రైతులు ఈ కాలువ కింద 300 ఎకరాల వరకు సాగు చేసుకుంటుండగా రెండేళ్ల క్రితం ఈ కా లువకు గండి పడగా నిత్యం రైతులే స్వయంగా గండి పూడ్చేసుకుంటూ వస్తున్నారు. ఈ దుస్థితిపై స్పందించిన కలెక్టర్ కుమార్‌దీపక్ ఇరిగేషన్ శాఖ అధికారులను శాశ్వత మరమ్మతుల కోసం ఆదేశించారు. దీంతో మరమ్మతు కోసం అవసరమైన నిధులతో అంచనాలు తయారు చేసి పంపించారు. నిధులు మంజూరు కాగానే శాశ్వత మరమ్మతు పూర్తి చేస్తామని మంచిర్యాల సబ్ డివిజన్ ఇరిగేషన్ డెప్యూటీ ఈఈ ఎం.కుమార్ తెలిపారు.

హమాలీల దీక్షకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న దాసు

బెల్లంపల్లి/తాండూర్: సివిల్ సప్లయ్ గోదాంలలో పని చేస్తున్న హమాలీల కూలీ రేట్లను ప్రభుత్వం వెంటనే పెంపుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి, తాండూర్ సివిల్ సప్లయ్ గోదాంల ఎదుట శనివారం తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో హమాలీలు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరీని నిరసిస్తూ ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపట్టబోతున్నామన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు హమాలీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



కోతి మృతదేహాన్ని పూడుస్తున్న యువకులు

బెల్లంపల్లి: రోడ్డుపై మృతి చెంది ఉన్న ఓ కోతికి మానవత దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహించి ఆదర్శంగా నిలిచారు బెల్లంపల్లికి చెందిన భజరంగ్ దళ్ శ్రేణులు. ఏఎంసీ ఏరియాలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట శనివారం ప్రధాన రహదారిపై కోతి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన ఓ ఆటో డ్రైవర్ భజరంగ్ దళ్ కార్యకర్తలకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన భజరంగ్ దళ్ కార్యకర్తలు పెట్టేం అశోక్, కంచి వేణు, సంతోష్‌లు ఘటనాస్థలికి వెళ్లి కోతి మృతదేహాన్ని పోచమ్మ చెరువు వద్ద ఉన్న శ్మశాన వాటికకు తీసుకొచ్చి అంతిమ సంస్కారాలు చేశారు.

బొగ్గుబాయి వార్తలు

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాజేశ్, ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్‌లు శనివారం సంస్థ సీఎండీ యన్ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. 2024, 2025ఆర్ఓఆర్ ప్రమోషన్ లిస్టును వెంటనే విడుదల చేయాలన్నారు. వీటిపై సీఎండీ సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఇంజనీర్‌కు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3 గనిలో ఇంజనీర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న సాయి శ్రావణ్‌ను శనివారం ఐఎన్టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. గనిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు, ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

జైపూర్: రామారావుపేట శివారులో ఓ వ్యక్తి తన వ్యక్తిగత వ్యాపార లాభం కోసం రూ.కోట్లతో నిర్మించుకుంటున్న అధునాతన రైస్‌మిల్లుకు కొంతమంది సింగరేణి అధికారుల మద్దతుతో బీటీ రోడ్డు నిర్మించడానికి టెండర్లు పిలిచారని ఆరోపించారు. దీన్ని విరమించుకొని ప్రభావిత గ్రామాల్లో ఆ నిధులతో అభివృ పనులు చేపట్టాలని స్థానిక తాజా మాజీ ప్రజాప్రతినిధులు శ్రీరాంపూర్ జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) డైరీని కలెక్టర్ కుమార్‌దీపక్ శనివారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డైరీ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బట్టారీ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపు, పద్మ, మన్మోహన్, మహాలక్ష్మి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించాలనే క్రికెట్ పోటీలు



విజేత మిస్టర్ ఫైస్ జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, రఘునాథ్

మంచిర్యాలటౌన్: యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడు సంవత్సరాలుగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పేరిట క్రికెట్ టోర్నమెంట్‌ను మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి నిర్వహిస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంచిర్యాల పట్టణంలోని శివాజి గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ 7వ ఎడిషన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించగా, ముఖ్య అతిథిగా సిర్పూర్ ఎమ్మెల్యే హాజరై ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ నాయకత్వంలో ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా యువతను క్రీడల్లో ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. జిల్లాలోని యువత క్రీడల్లో రాణించేందుకు రఘునాథ్ కృషి చేయడం అభినందనీయం అని కొనియాడారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువతలో క్రీడానైపుణ్యం ఉందని, క్రికెట్, కబడ్డీ టోర్నమెంటులను జిల్లాలో నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లో యువత కోసం వివిధ క్రీడల్లో టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. టోర్నమెంటులో మొత్తం 64జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో తలపడిన మిస్టర్ ఫ్రైస్ జట్టు గెలుపొంది విన్నర్ ట్రోఫీ, రూ.15వేల క్యాష్ ప్రైజ్, రన్నర్‌గా నిలిచిన సతీశ్ స్మాషర్స్ జట్టుకు రన్నర్ ట్రోఫీ, రూ.7500ల క్యాష్ ప్రైజ్‌ను క్రీడాకారులకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, రజనీశ్ జైన్, దుర్గం అశోక్, గాజుల ముఖేశ్ గౌడ్, ఎనగందుల కృష్ణమూర్తి, రమణరావు, మోటపలుకుల తిరుపతి, సత్రం రమేశ్, గద్దం స్వామిరెడ్డి, సంజీవ్, బెల్లంకొండ మురళి, జయరామ రావు, ముదాం మల్లేశ్, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, కర్రె చక్రి, బింగి సత్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

జన్నారం: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. జన్నారం మండలంలోని ఆశ్రమ పాఠశాల(బాలుర)ను శుక్రవారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా బోధన ఎలా జరుగుతుందని, డైట్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని 10వ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. దోమల వల్ల వ్యాపించే డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం అందేలా చూడాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

వేమనపల్లి: కూలీలకు కనీస వేతనం రూ.300 అందేలా పనులు చేయించాలని శనివారం డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని కేతన్‌పల్లి, ముల్కలపేట, నీల్వాయి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. గ్రామపంచాయతీలలో మునగ, వెదురు, ఈత, తాటి, నీలగిరి మొక్కల పెంపకం కోసం శ్రద్ధ తీసుకోవాలన్నారు. నర్సరీలలో ఉదయం, సాయంత్రం నీరు పట్టాలని సూచించారు. ప్రతి జాబ్‌కార్డుదారుడు వంద రోజుల పని పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం ముల్కలపేటలో ఇందిరాక్రాంతి పథకంలో మంజూరైన కోళ్ల పెంపకం ఫారంను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఈసీ మధుకర్, ఐకేపీ సీసీలు రాజారాం, పంచాయతీ కార్యదర్శులు అశోక్, జాఫర్ పాల్గొన్నారు.

నీటికుంట పరిశీలన

వేమనపల్లి: ఉపాధిహామీ ఫారంపండ్ పశువులకు, వన్యజీవులకు జీవధారలాంటిదని డీఆర్డీవో కిషన్ అన్నారు. ఉపాధిహామీ పనుల తనిఖీల్లో భాగంగా నీల్వాయి అటవీ ప్రాంతంలో గతేడాది రూ.2లక్షలతో నిర్మించిన ఫారంఫండ్ కుంటను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ ఉన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



విద్యార్థులతో ట్రస్ట్ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని దొనబండ, సబ్బేపల్లి, రాపల్లి, గఢ్పూర్, ముల్కల్ల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8, 9 తరగతులు చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఉల్లాస్ ట్రస్ట్ ఒక్కొరికీ రూ.వెయ్యి విలువ గల చెక్కును మొత్తం 50మంది విద్యార్థులకు రూ.50వేల విలువ గల చెక్కులను మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, ట్రస్ట్ సభ్యుడు సుర్మిళ్ల యుగంధర్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఆహార పదార్థాలతో విద్యార్థులు

జన్నారం: మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఆహార పదార్థాలు ఎలా తయారు చేస్తారు, వాటి ద్వారా ఉపయోగాలు తెలియజేశారు.

'దళితుల అభివృద్ధిని విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

చెన్నూర్: దళితుల అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో చెన్నూర్ ఏరియా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం చెన్నూర్ ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో జుమ్మిడి కుమార్, తాండ్ర అనిల్, దాసరి చందు, రాజేశ్వరి, ప్రమీల, తిరుమల రాజ్, తిలక్, నరేశ్, కృష్ణమాచారి, శశికుమార్ పాల్గొన్నారు.

'భయభ్రాంతులకు గురి చేస్తున్నారు'



మాట్లాడుతున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని గురువాపూర్‌లో శివారులో ఆదివాసీ గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను అక్రమంగా దొంగ పట్టాలు చేసుకొని ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆదివాసీ గిరిజనులు కుర్సింగ మోహన్, ఆత్రం మహదు, ఆడే నగేష్, కుర్సింగ కేశవరావులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తమ భూమిని ఇనిగంటి సత్యనారాయణరావు కుటుంబ సభ్యుల పేరుమీద, వీర్ల సుధాకర్ పేర్ల మీద పట్టాలు చేసుకున్నట్లు ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా కాస్తులో, కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న తమ నుంచి భూములు లాక్కోవాలని చూస్తున్నారని, అధికారులు స్పందించి వెంటనే విచారణ జరిపి పట్టాలు రద్దు చేయాలని తమ పేర్ల మీద పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు.

బేస్‌క్యాంపు సిబ్బందికి బ్యాగులు పంపిణీ



బ్యాగుల పంపిణీలో రేంజ్ అధికారి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సభ్యుడు

జన్నారం: జన్నారం అటవీడివిజన్ పరిధిలోని వివిధ రేంజ్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన 50మంది బేస్‌క్యాంపు సిబ్బందికి ప్రపంచ వైల్డ్‌లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సభ్యుడు హర్షవర్ధన్, రేంజ్ అధికారి సుష్మారావులు సిబ్బందికి బ్యాగులను అందజేశారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేత

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఐదు జిన్నింగ్ మిల్లులలో తా త్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలి పా రు. జిన్నింగ్ మిల్లులలో పత్తి నిలువలు పే రుకుపోయాయని, తదుపరి కొనుగోలు తేదీని తెలిపేంత వరకు రైతులు పత్తిని మిల్లులకు తీసుకురావద్దని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జైపూర్: మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రాసపల్లి రవి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు రాజన్న, మండల కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యంపల్లి పాఠశాల సందర్శన



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈవో

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి మండల ప్రాథమిక పాఠశాలను శనివారం మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి, కాసిపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సోంబమూర్తి సందర్శించారు. విద్యార్థుల ప్రతిభ తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.